

సామాజిక కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తున్న రెడ్డి సంఘాల రాష్ట్ర కన్వీనర్ బద్దూరి వెంకటేశ్వరరెడ్డిని రెడ్డిగర్జన సంస్థ ఉగాదిపురస్కారం-2024తో సత్కరించింది. తెలంగాణ రాష్ట్ర రోడ్ల అభివృద్ధి సంస్థచైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, సంకెపల్లి సుధీర్‌రెడ్డి, ఎన్.సత్యనారాయణరెడ్డిలు ఆయనకు పురస్కారం అందజేసి సత్కరించారు. - దిల్‌సుఖ్‌నగర్, ఆంధ్రజ్యోతి

నేడు పంచాంగ శ్రవణం

కొత్తపేట, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): కొత్తపేట డివిజన్ స్నేహపురికాలనీలోని శ్రీగోదాసమేత పద్మావతీ వేంకటేశ్వరస్వామి ఆలయంలోని శ్రీనివాస కల్యాణ మండపంలో మంగళవారం సాయంత్రం క్రోధినామ సంవత్సర ఉగాది పంచాంగ శ్రవణం ఉంటుందని ఆలయ కమిటీ చైర్మన్ వారణాశివంశీ తెలిపారు. శ్రీపద్మావతీదేవి, గోదాదేవి, వేంకటేశ్వరస్వామి వార్లకు, ఆలయప్రాంగణంలోని విజయవినాయకస్వామి, ప్రసన్నాంజనేయస్వామి, కాశీవిశ్వేశ్వర, అన్నపూర్ణాదేవి, అయప్ప స్వామివార్లకు ఉదయం 5 గంటలకు ఉగాది విశేష అభిషేకాలు నిర్వహించనున్నామని తెలిపారు. సాయంత్రం 5.30 నుంచి ఆధ్యాత్మిక ప్రవచనకర్త డా.కాకునూరి సూర్యనారాయణ మూర్తి క్రోధినామ ఉగాదిపంచాంగ శ్రవణం నిర్వహిస్తారన్నారు.

హనుమాన్ దేవస్థానంలో..

చంపాపేట, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని శ్రీహనుమాన్ దేవస్థానంలో నూతన తెలుగు సంవత్సరం ఉగాదిని పురస్కరించుకొని నిత్య పూజలందుకుంటున్న శ్రీధ్యానాంజనేయస్వామికి మంగళవారం ఉదయం ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ నల్ల రఘుమారెడ్డి, ఈవో ఎం.శ్రీనివాసశర్మ, ధర్మకర్తలు తెలిపారు. సాయంత్రం 6:30 గంటలకు శ్రీక్రోధినామ సంవంత్సరం సందర్భంగా ఆలయంలో పంచాంగ శ్రవణ కార్యక్రమం, శ్రీసీతారామ లక్ష్మణ సమేత హనుమంత్ రథోత్సవం నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

వృద్ధాశ్రమంలో ఇఫ్తార్ విందు

ఎల్‌బీనగర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని మహేశ్వరం నియోజకవర్గం బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మహ్మద్ సలీం ఆధ్వర్యంలో సరూర్‌నగర్‌చౌడీలోని మహిళల వృద్ధాశ్రమంలో సోమవారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. అనంతరం వృద్ధులకు చీరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ దయానంద్‌గుప్త, బీఆర్ఎస్ సరూర్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు మహేందర్‌యాదవ్, మాజీ అధ్యక్షుడు అంకిరెడ్డి, పోలె అరవింద్, రిషి, కట్టా ప్రవీణ్‌ముదిరాజ్, దస్తగిరి, యశ్వంత్‌రెడ్డి, టీఆర్ఎస్‌వీ డివిజన్ అధ్యక్షుడు రాకేష్‌కుమార్, నారాయణ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయ నిర్మాణానికి రూ.11లక్షల విరాళం

సరూర్‌నగర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): బాలాపూర్ మండలం నాదర్‌గుల్‌లో పునర్నిర్మాణంలో ఉన్న శ్రీహనుమాన్ ఆలయానికి ఇక్కడి ఎంవీఎస్ఆర్ ఇంజనీరింగ్ కాలేజీ యాజమాన్యం రూ.11 లక్షలను విరాళంగా ప్రకటించింది. ఈ చెక్కును సోమవారం విద్యాసంస్థల సంయుక్తకార్యదర్శి వాసుదేవరావు ఆలయ కమిటీ చైర్మన్ మర్రి నర్సింహారెడ్డికి అందజేశారు. మాజీ సర్పంచ్ మర్రి హన్మంత్ రెడ్డి, ఆలయ కమిటీ ప్రతినిధి పెత్తుల్ల ఆనంద్‌రెడ్డి పాల్గొన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

సరూర్‌నగర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని బడంగ్‌పేట్ కమిషనర్ జి.రఘు సూచించారు. సోమవారం ఎస్సీ కమ్యూనిటీ హాల్‌లో ఓటు హక్కుపై ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన స్థానికులతో ఓటు హక్కు వినియోగంపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మునిసిపల్ మేనేజర్ వి.నాగేశ్‌బాబు, ఆర్వో డి.చంద్రశేఖర్‌రెడ్డి, ఆర్పీలు, సీనియర్ సిటిజన్లు, ప్రజలు పాల్గొన్నారు.

పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించలేదని నర్సు ఆత్మహత్య

దిల్‌సుఖ్‌నగర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి సంబంధించిన నర్సింగ్ ఉద్యోగ పరీక్షల్లో అర్హత సాధించలేదన్న మనస్థాపంతో ఓ నర్సు ఆత్మహత్య చేసుకున్నది. సరూర్‌నగర్ ఎస్ఐ మాధవరావు తెలిపిన వివరాల ప్రకారం.. వెస్ట్ బెంగాల్‌కు చెందిన ప్రియ(23) కొద్ది రోజుల క్రితం ఉద్యోగం కోసం నగరానికి వచ్చింది. 15 రోజుల క్రితం సరూర్‌నగర్‌లోని సాయితేజ ఆస్పత్రిలో నర్సుగా విధుల్లో చేరింది. ఆదివారం డ్యూటీ లేకపోవడంతో ఆస్పత్రికి వెళ్లకుండా గదిలో ఉన్నది. అయితే ఇటీవల తమ స్వరాష్ట్రం పశ్చిమ బెంగాల్‌లో నర్సు ఉద్యోగ పరీక్షలు రాసింది. ఆదివారం ఆ పరీక్షలకు సంబంధించిన రిజల్ట్స్ రాగా, ప్రియ క్వాలిఫై కాలేదు. దీంతో మనస్థాపానికి గురైన ఆమె గదిలోనే ఉన్నది. రాత్రి ఆమె గదికి వచ్చిన తోటి నర్సు ఆమె ఉరివేసుకుని ఉండడం చూసి, ఆస్పత్రి యజమాన్యానికి సమాచారం ఇచ్చింది. దీంతో సరూర్‌నగర్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు.



ప్రియ మృతదేహం

10 కిలోల గంజాయి పట్టుకున్న పోలీసులు

హయత్‌నగర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లోని అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి బైకు పైన హైదరాబాద్‌కు తరలిస్తున్న 10 కిలోల గంజాయిని మహేశ్వరం ఎస్ఓటీ, హయత్‌నగర్ పోలీసులు కలిసి హైవే బవార్చీ జేసీబీ జంక్షన్ వద్ద పట్టుకున్నారు. ధూల్‌పేట్, ముషీరాబాద్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌లలో వివిధ కేసుల్లో ముద్దాయిగా ఉన్న సికింద్రాబాద్ కవాడిగూడకు చెందిన మోతిలాల్ నర్సింగ్ బాలాజీసింగ్(37) అల్లూరి సీతారామరాజు జిల్లా దారకొండలో 10 కిలోల గంజాయిని స్థానికుడైన రాము వద్ద కొనుగోలు చేశాడు. సుజుకి బర్గ్‌మాన్ బైకు పైన పెట్టుకుని హైదరాబాద్‌కు బయలు దేరాడు. విశ్వసనీయ సమాచారంతో మహేశ్వరం ఎస్ఓటీ, హయత్‌నగర్ పోలీసులు సంయుక్తంగా హయత్‌నగర్ బవార్చీ హోటల్ వద్ద ఆదివారం రాత్రి కాపుకాచి పట్టుకున్నారు. వెంటనే మోతిలాల్ నర్సింగ్ బాలాజీసింగ్‌ను అతడి వద్ద 7 ప్యాకెట్లలలో ఉన్న 10 కిలోల గంజాయిని, ఒక సెల్ ఫోన్, బైకును స్వాధీనం చేసుకున్నారు. రాము పరారీలో ఉన్నాడని పోలీసులు తెలిపారు. నిందితునిపైన అనేక కేసులు ఉన్నాయని పోలీసులు తెలిపారు. సోమవారం నిందితున్ని రిమాండుకు తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి అనుమానాస్పద మృతి

హయత్‌నగర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో ఓ యువకుడు జాతీయ రహదారిపైన వర్షం నీటి కోసం నిర్మించిన నాలా శ్లాబ్ మీద మృతదేహం ఉంది. హయత్‌నగర్ పోలీసులు కథనం ప్రకారం.. అనాజీపూర్ గ్రామానికి చెందిన ఎర్పుల ఉదయ్‌కిరణ్(21) ఉమర్‌ఖాన్ గూడలో భారత్ పెట్రోల్ బంకులో పనిచేస్తున్నాడు. ఆదివారం రాత్రి మూడు గంటలకు నిద్రలేచి పెట్రోల్ బంకులో పడుకుంటానని ఇంటి నుంచి వచ్చాడు. సోమవారం ఉదయం పెద్దఅంబర్‌పేట్ వద్ద గల కజారియా టైల్స్ గోదాం ఎదురుగా విజయవాడ జాతీయ రహదారి మధ్యలో వర్షం నీటి కోసం నిర్మించిన నాలాసిమ్మెంట్ దిమ్మపై మృతదేహం ఉంది. బైకు కూడా అక్కడే పడి ఉంది. ఉదయ్‌కిరణ్ పెద్ద అంబర్‌పేట్‌కు ఎందుకు వచ్చాడో అనుమానాస్పదంగా మారింది. వరద కాలువను ఢీకొని చనిపోయాడా లేక గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేశారా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. స్థానికంగా ఉన్న సీసీ కెమెరాలను పోలీసులు పరిశీలిస్తున్నారు. తండ్రి నరసింహ ఫిర్యాదు మేరకు హయత్‌నగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



మృతదేహం



ఉదయ్‌కిరణ్ (ఫైల్)

అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

కొత్త పేట, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని నాగోల్ పోలీసులు అరెస్టు చేశారు. ఎస్‌హెచ్ఓ పరశురాం కథనం ప్రకారం.. ఉప్పల్ శాంతి నగర్‌కు చెందిన భూక్య రమేష్(32) సోమవారం రాత్రి కారులో అక్రమంగా కార్టూన్లలో బీరుబాటిళ్లను తరలిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. వెంటనే ఎస్ఐ మధు సిబ్బందితో బండ్లగూడ పీఎంఆర్ ఫంక్షన్ హాల్ ఎదురుగా నిలిపిన నిందితుడి కారును తనిఖీ చేశారు. అందులో కార్టన్లలో 216 బీరు బాటిళ్లు ఉన్నాయి. నిందితుడిని అదుపులోకి తీసుకుని, బీరుబాటిళ్లను, కారును స్టేషన్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కాలనీల్లో రోడ్లు కబ్జా

- పాడవాటి ర్యాంపులు.. మొక్కల కోసం ఫెన్సింగ్.. పార్కింగ్ ప్లేస్!
- ర్యాంప్‌ల నిర్మాణంతో కుంచించుకుపోతున్న దారులు
- బడంగ్‌పేట్‌లో ఇదీ పరిస్థితి
- అధికారులకు జీబీఆర్ కాలనీవాసుల ఫిర్యాదు

సరూర్‌నగర్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): అసలే అవి గ్రామ పంచాయతీల నాటి పాతలేఅవుట్లు.. వాటిలో ఉండేది కేవలం 20-25 అడుగుల వెడల్పు రోడ్లే. వాటిని కూడా ఆక్రమిస్తే పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోవచ్చు! బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని అనేక కాలనీల్లో ఇదే పరిస్థితి ఉంది. పచ్చదనం మీద ఎక్కడాలేని ఆసక్తి పుట్టుకొచ్చినట్టు ఎక్కడికక్కడ రోడ్లపై ఐదారు అడుగుల మేర ఆక్రమించి ఫెన్సింగ్ వేసుకుంటున్నారు. ఇక ఇళ్ల ముందు ర్యాంపుల నిర్మాణం సంగతి సరేసరి!! అది చాలదన్నట్టు కొందరు ఇళ్ల యజమానులు మొక్కల కోసం వేసిన ఫెన్సింగ్ పక్కన కారు పార్కింగ్ కోసం సిమెంట్ బెడ్ వేయించుకుంటున్నారు. దాంతో 20-25 అడుగుల రోడ్లు కాస్త దాదాపు పది అడుగులకు కుంచించుకుపోతున్నాయి. పర్యవసానంగా సదరు రోడ్లపై వాహనాలు వెళ్లలేని దుస్థితి నెలకొంటోంది. బడంగ్‌పేట్ కార్పొరేషన్ గుర్రంగూడ 7వ డివిజన్‌లోని జీబీఆర్ కాలనీలో పరిస్థితి మరీ దారుణంగా తయారయింది. తమ కాలనీలోని రోడ్లను దర్జాగా ఆక్రమించి ర్యాంపులు, మొక్కల కోసం ఫెన్సింగ్, పార్కింగ్ కోసం సీసీ బెడ్ నిర్మించి, దారులను మూసేస్తున్నారని స్థానికులు వాపోతున్నారు.

మునిసిపల్ అధికారులకు ఫిర్యాదు

గుర్రంగూడలోని జీబీఆర్ కాలనీలో 25 అడుగుల రోడ్లను దాదాపు 17 అడుగుల మేర ఆక్రమించి ర్యాంపుల, మొక్కల పెంపకం, పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేసుకుంటున్నారని, దాంతో కేవలం 8 అడుగుల దారే మిగులుతోందని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడి రోడ్ల ఆక్రమణపై సోమవారం కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు ఫొటోలతో సహా మునిసిపల్ కమిషనర్‌కు, మేయర్‌కు ఫిర్యాదు చేశారు. కుచించుకుపోయిన రోడ్లపై అత్యవసర సమయాల్లో అంబులెన్స్‌లు కూడా వెళ్లలేకపోతున్నాయని, అదేమని ప్రశ్నిస్తే ఆక్రమణదారులు ఉల్టా తమనే బెదిరిస్తున్నారని తమ ఫిర్యాదులో పేర్కొన్నారు. అధికారులు స్పందించి తమ కాలనీలోని రోడ్ల ఆక్రమణల(ర్యాంపులు, మొక్కల పెంపకం కోసం ఏర్పాటు చేసిన ఫెన్సింగ్, కారు పార్కింగ్ కోసం నిర్మించుకున్న సీసీ బెడ్లు)ను తొలగించాలని వారు అధికారులను కోరారు.



ఇంటి బయట రోడ్డుపై మొక్కల కోసం కొంతభాగం ఆక్రమించి, దాని పక్కన వాహనాలను పార్కు చేసిన దృశ్యం



కారు పార్కింగ్ కోసం సీసీబెడ్ వేయించుకుని ఇరువైపులా వాహనాలను నిలపడంతో మధ్యలో ఇరుకుగా మారిన దారి

అన్ని కాలనీల్లో ఇదే పరిస్థితి

బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని అనేక కాలనీల్లో ఇదే సమస్య రాజ్యమేలుతోంది. ఎక్కడ చూసినా రోడ్డు సగం దాకా ర్యాంపులను నిర్మిస్తున్నారు. ఇరువైపులా నిర్మించే ర్యాంపుల వల్ల రోడ్డు మొత్తం మూసుకుపోయే దుస్థితి ఏర్పడుతోంది. పైగా ప్లాంటేషన్ కోసం ఫెన్సింగ్, ఆ తర్వాత సొంత వాహనాల పార్కింగ్ కోసం ప్రత్యేక ఏర్పాట్లు సైతం రోడ్డుపైనే చేసుకుంటుండడంతో ఆ రోడ్లలో ఇతర వాహనాలు సాఫీగా వెళ్లలేని పరిస్థితి నెలకొంటోంది. మునిసిపల్ అధికారులు సదరు ఆక్రమణలపై దృష్టి సారించి స్థానికుల ఇబ్బందులు దూరం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

గిరిజనులు, ఆదివాసీల కార్పొరేషన్ల ఏర్పాటుపై హర్షం

- ఎన్‌టీఎఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు వల్లభాయ్ ఉషాకిరణ్

చంపాపేట, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): గిరిజనులు, ఆదివాసీల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం మూడు కార్పొరేషన్లు ఏర్పాటు చేయడం హర్షణీయం అని నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు వల్లభాయ్ ఉషాకిరణ్ అన్నారు. చంపాపేట డివిజన్ గాయత్రినగర్ చౌరస్తాలోని ఎన్‌టీఎఫ్ కార్యాలయంలో సోమవారం జనరల్‌బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఉషాకిరణ్ హాజరై మాట్లాడుతూ కొమరంభీమ్ స్టేట్‌ఫైనాన్షియల్ కార్పొరేషన్, సంత్ సేవాలాల్ లంబాడా ఫైనాన్షియల్ కార్పొరేషన్, ఏకలవ్య స్టేట్ ఫైనాన్షియల్ కార్పొరేషన్ ఏర్పాటుకు కృషిచేసిన సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి సీతక్కకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో సున్నితమైన ఆదివాసీ/గిరిజనుల సమస్యలను ఒక్క కలంపోటుతో కాంగ్రెస్ పార్టీ ఫుల్‌స్టాప్ పెట్టిందని ఆయన కొనియాడారు. త్వరలో పెద్దఎత్తున అభినందనసభను ఏర్పాటు చేయనున్నట్లు ఉషాకిరణ్ తెలిపారు. త్వరలో నాగర్‌కర్నూల్‌లో ఆదివాసీ, లంబాడ, చెంచు, ఎరుకల కృతజ్ఞత సభను ఏర్పాటు చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎన్‌టీఎఫ్ ఆదివాసీ కన్వీనర్ వాసం రామకృష్ణదొర, లంబాడా కన్వీనర్ కొర్ర వంశీనాయక్, లంబాడాజాతి మహిళాకన్వీనర్ నాగమణి, చెంచుజాతి కన్వీనర్ వెంకట్ సెంచు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో ఎన్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వల్లభాయ్ ఉషాకిరణ్

మోదీకి ఓట్లేస్తే మరోసారి మోసం గ్యారెంటీ

టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్

వనస్థలిపురం, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ గ్యారెంటీ ఇచ్చిందంటే పక్కాగా అమలు చేస్తుందని, కానీ మోదీ గ్యారెంటీ అంటే మరొకసారి ప్రజలను మోసం చేయడమే గ్యారెంటీ అని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ మల్కాజ్‌గిరి పార్లమెంట్ అభ్యర్థి పట్నం సునితామహేందర్‌రెడ్డితో కలిసి మధుయాష్కీగౌడ్ సోమవారం ఉదయం బీఎన్‌రెడ్డినగర్ డివిజన్‌లోని వివేకానంద పార్కులో, వనస్థలిపురం డివిజన్‌లోని రైతుబజార్ యోగాపార్కులో మార్నింగ్‌వాక్ చేశారు. అక్కడి వాకర్స్‌తో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మధుయాష్కీగౌడ్ మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించిందన్నారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పి వాటిని కల్పించకుండా మోసం చేసిందన్నారు. తమ కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ ప్రకటించిన ఐదు గ్యారెంటీలను కచ్చితంగా అమలు చేస్తామన్నారు. నిరుద్యోగ యువతకు ఏడాదికి లక్ష, మహిళలకు కూడా ఏడాదికి లక్ష రూపాయలను ఇచ్చేలా కాంగ్రెస్ తమ మేనిఫెస్టోలో ప్రకటించిందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి సర్కారు వచ్చిన 100 రోజుల్లోనే ఇచ్చిన గ్యారెంటీలను అమలు చేసిన ఘనత తమదేనన్నారు. అందులో భాగంగా ఉచిత బస్సు ప్రయాణం రాష్ట్రంలోని లక్షలాది మంది మహిళలకు ఎంతో ఉపయోగపడుతుండడంతో మహిళలు ఎంతో ఆనందంగా ఉన్నారని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని, మల్కాజిగిరి ఎంపీగా కాంగ్రెస్ అభ్యర్థి సునితామహేందర్‌రెడ్డిని భారీమెజార్టీతో గెలిపించాలన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఇండియా కూటమి అత్యధిక స్థానాలు గెలుపొంది ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని, అందులో ఎలాంటి సందేహమూ లేదన్నారు. అనంతరం పలు డివిజన్ల సీనియర్ నాయకులతో ఎంపీ ఎన్నికల వ్యూహాలపై మధుయాష్కీగౌడ్ చర్చించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రతినిధి జక్కిడి ప్రభాకర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ సామ రమణారెడ్డి, మాజీ కౌన్సిలర్లు ఈశ్వరమ్మ యాదవ్, షాలిని, డివిజన్ అధ్యక్షులు కుట్ల నర్సింహయాదవ్, మకుటం సదాశివుడు, బుడ్డా సత్యనారాయణ, వేములయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారంలో కరపత్రాలను పంపిణీ చేస్తున్న మధుయాష్కీ గౌడ్, మల్కాజ్‌గిరి ఎంపీ అభ్యర్థి పట్నం సునీతా మహేందర్ రెడ్డి

వేసవిలో పారిశుధ్య కార్మికులు జాగ్రత్తగా ఉండాలి

హయత్‌నగర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): రోజు రోజుకూ పెరుగుతున్న ఎండలను దృష్టిలో పెట్టుకుని తుర్కయంజాల్ మున్సిపల్ పారిశుధ్య కార్మికులు జాగ్రత్తగా ఉండాలని చైర్‌పర్సన్ మల్‌రెడ్డి అనురాధ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని ఇంజాపూర్‌లో జరుగుతున్న పారిశుధ్య పనులను సోమవారం చైర్‌పర్సన్ అనురాధ కమిషనర్ సత్యనారాయణరెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులు ఆరోగ్యం పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్, సిబ్బంది నగేష్, హరీష్, నవీన్ పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ అనురాధ, కమిషనర్ సత్యనారాయణరెడ్డి

'అయ్యప్ప భక్తుల సమస్యల పరిష్కారానికి కృషి'

చంపాపేట, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ప్రతి సంవత్సరం శబరిమలకు వెళుతున్న అయ్యప్ప స్వాములు ఎదుర్కొంటున్న వివిధ సమస్యల పరిష్కారం కోసం తమవంతు కృషి చేయనున్నట్లు గురుస్వాములు రమణ గురుస్వామి, చంపాపేట కార్పొరేటర్, గురుస్వామి వంగా మధుసూదన్‌రెడ్డి అన్నారు. హస్తినాపురం డివిజన్ డిఫెన్స్‌కాలనీలోని శ్రీహరిహర క్షేత్ర అయ్యప్పస్వామి ఆలయంలో సోమవారం తెలంగాణ అయ్యప్ప ఐక్యవేదిక ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గురుస్వాములు బుచ్చిరెడ్డి, బాలకృష్ణ, రాధాకృష్ణ, ప్రేమ్‌గాంధీ, కేశవ్, సత్యప్రియ, రాజుదేశ్ పాండే, వీరస్వామి, విగ్నేష్, బసవేశ్వర పాల్గొన్నారు.

200 అడుగుల పూలే విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి

బర్కత్‌పుర, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): బీసీల ఆకాంక్షను గౌరవిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం సామాజిక సంఘ సంస్కర్త, బడుగు, బలహీనవర్గాల ఆశాజ్యోతి మహాత్మా జ్యోతిరావు పూలే 200 అడుగుల విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ విజ్ఞప్తి చేశారు. సోమవారం బషీర్‌బాగ్‌ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో జ్యోతిరావు పూలే జయంతి ఉత్సవాల రాష్ట్రస్థాయి నిర్వహణ కమిటీ చైర్మన్‌గా చిన్న శ్రీశైలంయాదవ్‌ను నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో 5 ఎకరాలలో జ్యోతిరావు పూలే స్మృతి వనాన్ని నిర్మించాలని కోరారు. పూలే జయంతి ఉత్సవాల నిర్వహణ కమిటీ చైర్మన్ చిన్న శ్రీశైలంయాదవ్ మాట్లాడుతూ ఈనెల 11న నగరంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా పూలే జయంతి వేడుకల నిర్వహిస్తున్నామని, రాజకీయాలకు అతీతంగా ఈ వేడుకలు జరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘాల నేతలు కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, తాటికొండ విక్రమ్‌గౌడ్, కనకాల శ్యామ్‌కుర్మ, సదానందం, శ్రీనివాస్ గౌడ్, స్వర్ణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కోయ భాష అకాడమీని ఏర్పాటు చేయాలి

- లిపి సృష్టికర్త చిలుకూరి అమరవరప్రసాద్

బర్కత్‌పుర, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): అతి పురాతనమైన కోయ భాషను అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం అకాడమీని ఏర్పాటు చేయాలని కోయ భాష లిపి, సృష్టికర్త చిలుకూరి అమరవరప్రసాద్ కోరారు. కోయభాష లిపితో పాఠ్యాంశాలను ముద్రించి ప్రాథమిక విద్యాస్థాయిలో బోధించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో కోయ భాష సంస్కృతి, అభివృద్ధి సంస్థ ఏర్పాటు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోయ భాషలో పాఠ్య పుస్తకాలను ముద్రించి 1 నుంచి 5వ తరగతి వరకు అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో బోధించాలని కోరారు. కోయ భాష లిపిని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించాలని కోరారు. కోయలు జీవనం సాగిస్తున్న ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలలో కూడా కోయ భాష లిపిని అమలు చేయాలని కోరారు. త్వరలో రవీంద్రభారతిలో రెండు రోజుల పాటు కోయ సాహిత్య సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న చిలుకూరి అమరవరప్రసాద్

కార్యవర్గం..

భాషాభివృద్ధికి కోయ లాంగ్వేజ్ డెవలప్‌మెంట్ అసోసియేషన్‌ను కొత్తగా ఏర్పాటు చేసి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. గౌరవ అధ్యక్షుడిగా ప్రొఫెసర్ రేగా రాజేందర్, అధ్యక్షుడుగా గొండి వెంకటరమణ, ఉపాధ్యక్షులుగా కె.శంకర్‌రావు, సెక్రటరీ జనరల్‌గా ప్రొఫెసర్ జి.అనురాధ, జనరల్ సెక్రటరీగా ప్రొఫెసర్ కిషోర్, కోశాధికారిగా డాక్టర్ కె.పద్మజ, సంయుక్త కార్యదర్శి ప్రొఫెసర్ నాగేశ్వరరావు, కార్యనిర్వాహక కార్యదర్శిగా పూసం వెంకటలక్ష్మి నియమితులైనట్లు ఆయన తెలిపారు.

ప్రెస్‌క్లబ్ హైదరాబాద్‌కు మంచి భవనాన్ని నిర్మిస్తాం

పంజాగుట్ట, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ప్రెస్‌క్లబ్ ఆఫ్ హైదరాబాద్ భవనాన్ని అన్ని హంగులతో అద్భుతంగా నిర్మించి ఇస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. సోమవారం రాత్రి ప్రెస్‌క్లబ్‌లో జరిగిన ఇఫ్తార్ విందుకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.20కోట్లు ఖర్చు అయినా సరే పాత్రికేయుల కోసం అన్నిహంగులతో కూడిన భవనాన్ని నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం ప్రెస్‌క్లబ్‌లో నిర్మిస్తున్న మహిళా భవనానికి తన స్వచ్ఛంద సంస్థ నుంచి రూ.5లక్షల ఆర్థిక సహాయం అందిస్తానని, ఇందుకు సంబంధించిన చెక్కును మంగళవారం అందజేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వేణుగోపాల్ నాయుడు, రవికాంత్ రెడ్డి, మాజీ అధ్యక్షుడు విజయ్ కుమార్ రెడ్డి, కోశాధికారి రాజేష్, సంయుక్త కార్యదర్శి హరిప్రసాద్, ఈసీ మెంబర్లు వనజ, శ్రీను, సీనియర్‌పాత్రికేయులు యూసుఫ్ బాబా, ఆజంఖాన్, తదితరులు పాల్గొన్నారు.

హిమపురి కాలనీ సంక్షేమ సంఘం నూతన కమిటీ

వనస్థలిపురం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని హిమపురి కాలనీ సంక్షేమ సంఘం నూతన కమిటీని కాలనీవాసులు ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జడిగం రాములు, ఉపాధ్యక్షుడిగా సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా చెన్నోజు రవికిరణ్, కోశాధికారిగా సాదు వెంకన్న, కార్యనిర్వహణ కార్యదర్శిగా తిరుమలాచారి, సంయుక్త కార్యదర్శిగా రమేష్‌రెడ్డి, కల్చరల్ కార్యదర్శిగా సాంబశివరావు, గౌరవ అధ్యక్షులుగా సముద్రాల బద్రినాథ్, యాద సంతోష్ కుమార్, గౌరవ సలహాదారులుగా కంచర్ల సత్యనారాయణరెడ్డి, గోపి, కృష్ణారెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ కాలనీలో సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామన్నారు.

కర్మన్‌ఘాట్ గౌడసంఘం అధ్యక్షుడిగా సుదర్శన్

చంపాపేట, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్ గౌడ సంఘం అధ్యక్షుడిగా చేగోని సుదర్శన్‌గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. హస్తినాపురం డివిజన్ కేకే గార్డెన్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో అడ్‌హాక్ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు పాలెం బిక్షపతిగౌడ్, సురివి పెంటయ్య గౌడ్, ఎరుకల రాజుగౌడ్, చేగోని విఠల్‌గౌడ్, గొరిగె బాబుగౌడ్, సుంకరి రమేష్ గౌడ్ ఆధ్వర్యంలో సుదర్శన్‌గౌడ్‌ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సంఘం మాజీఅధ్యక్షుడు గొరిగె సురేష్‌గౌడ్, రఘుపతిగౌడ్, చేగోని అశోక్‌గౌడ్, గొరిగె శ్రీనివాస్‌గౌడ్, లింగాల దశరథ్‌గౌడ్, చేగోని మల్లేష్‌గౌడ్, కృష్ణాగౌడ్, రాకేష్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, విశ్వనాథ్‌గౌడ్, జగదీష్‌గౌడ్, శివగౌడ్ పాల్గొన్నారు.